క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, జఫ్రుల్లా

బండిఆత్మకూరు: జీసీపాలెం గ్రామంలో ఆదివారం రోటరీ క్లబ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇండియన్ మెడికల్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టరు జీ.రవిక్రిష్ణ, నంద్యాల అధ్యక్షుడు డాక్టరు జఫ్రుల్లా, సెక్రెటరీ డాక్టరు చంద్రశేఖర్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మహిళా విభాగం నంద్యాల అధ్యక్షురాలు డాక్టరు నర్మద, సెక్రెటరీ డాక్టరు మాధవి, రాష్ట్ర కార్యదర్శి వసుధ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మంచి వైద్యం అందించాలన్న ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కంచర్ల శోభారాణి, ఉప సర్పంచు కంచర్ల లింగారెడ్డి, రోటరీ క్లబ్ నంద్యాల అధ్యక్షుడు అనీల్‌కుమార్, సెక్రెటరీ మోహన్‌రెడ్డి, డాక్టరు హరిత పాల్గొన్నారు.

బాపనంతపురంలో అగ్నిప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆత్మకూరు: మండలంలోని బాపనంతపురం గ్రామంలో ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిమాపక కేంద్ర అధికారి భీముడు నాయక్ తెలిపిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన దినేష్ బాబు, ప్రభాకర్‌లకు చెందిన మొక్కజొన్న పంట, గడ్డివాములు, పక్కనే ఉన్న చింతచెట్టు అగ్నిప్రమాదంలో కాలిపోయాయి. సమాచారం మేరకు హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లి మంటలను వెంటనే ఆర్పివేయడంతో ఎకరన్నర వరి గడ్డివాములను కాపాడామని చెప్పారు.

పశుగ్రాసం దగ్ధం

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్న అగ్నిప్రమాదంలో వరిగడ్డి వామి దగ్ధమైంది. గ్రామానికి చెందిన గొల్ల శివన్న పశువులను మేపుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. పశువుల మేత కోసం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోని కల్లంలో నిల్వ ఉంచుకున్న పశుగ్రాసం పూర్తిగా అగ్నిప్రమాదంలో కాలిబూడిదైంది. స్థానికులు మంటలను ఆర్పేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో అగ్నిమాపక కేంద్రం సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనలో సుమారు రూ.50వేలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితుడు శివన్న ఆవేదన వ్యక్తం చేశారు.

గొప్ప సంఘసంస్కర్త కందుకూరి



వీరేశలింగం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: కందుకూరి వీరేశలింగం పంతులు గొప్ప సంఘ సంస్కర్త, అంటరానితనం రూపుమాపేందుకు కృషిచేసిన మహనీయుడని గ్రంథాలయ అధికారిణి కౌసల్య అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ వీరేశలింగం పంతులు సమాజంలో మహిళలు మగవారితో సమానంగా చదువుకోవాలనే ఉద్దేశ్యంతో సహవిద్యావిధానాన్ని ప్రవేశపెట్టాలన్నారు.

రాష్ట్రీయ కేంద్రీయ స్కూల్‌కు ఎంపిక



మోక్షేశ్వర్

వెలుగోడు: జూపాడుబంగ్లా మండలం తరిగోపుల గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ చంద్రశేఖర్, ప్రసన్న లక్ష్మి దంపతుల కుమారుడు కే. మోక్షేశ్వర్ బెంగళూరులోని రాష్ట్రీయ కేంద్రీయ స్కూల్‌కు ఎంపికయ్యాడు. ఇటీవల నిర్వహించిన కోరకొండ సైనిక్ స్కూల్ ప్రవేశపరీక్షలో ఏపీలో 4వ ర్యాంకు సాధించాడు. విజయనగరంలోని కేంద్రీయ విద్యాలయంలో 6 వ తరగతిలో సీటు వచ్చింది. ఆ తరువాత రాష్ట్రీయ కేంద్రీయ స్కూల్ అడ్మిషన్లలో మోక్షేశ్వర్‌కు బెంగళూరులోని రాష్ట్రీయ కేంద్రీయ స్కూల్‌కు ఎంపిక చేస్తూ కాల్ లెటర్ పంపించడంతో తల్లిదండ్రులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేశంలోనే ఐదు రాష్ట్రీయ కేంద్రీయ స్కూళ్లు ఉండగా పోటీ ఎక్కువగా ఉంటుందని, బెంగళూరు స్కూల్‌లో సీటు రావడం సంతోషంగా ఉందని విద్యార్థి మోక్షేశ్వర్ తెలిపారు.

లెక్కాపక్కా లేదు!

- తంగడంచ ఫారం భూముల విస్తీర్ణంపై స్పష్టత కరువు
- టీడీపీ పాలనలో స్పష్టతలేని జీఓలతో భూముల పంపిణీ
- ఉన్న వాటి కంటే అధికంగా కేటాయింపు



ప్రస్తుతం ముళ్లపొదలతో నిండిపోయిన తంగడంచ ఫారం భూమి

జూపాడుబంగ్లా: టీడీపీ పాలనలో తిమ్మిని బమ్మిని చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నానని కంపెనీలను స్థాపించి ప్రజలకు ఉద్యోగ, ఉపాధిని మెరుగుపరుస్తున్నానని నమ్మించి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బురిడీ కొట్టించారు. తంగడంచ ఫారం భూముల్లో మెగాఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, మెగాసీడ్ పార్కులను స్థాపిస్తున్నానని పేర్కొంటూ ఒకే స్థలాన్ని రెండు కంపెనీలకు ఇస్తున్నట్లు రెండు వేర్వేరు జీవోలు జారీచేశారు. ఈ నేపథ్యంలో తంగడంచ స్టేట్‌సీడ్ ఫారం భూముల పూర్తి విస్తీర్ణంపై నేటికీ అధికారుల వద్ద స్పష్టమైన లెక్కలు లేకపోవటం గమనార్హం.

పొంతన లేని లెక్కలు

తంగడంచ ఫారం పూర్తి విస్తీర్ణం 1616 ఎకరాలు (ఫారం అధికారుల లెక్కల ప్రకారం), స్టేట్ సెక్రెటరేట్‌లో ఉన్న లెక్కల ప్రకారం (తంగడంచ రెవెన్యూ పరిధిలో 845.73 ఎకరాలు, 35 బొల్లవరం రెవెన్యూ పరిధిలో 758.24 ఎకరాలు) 1603.97 ఎకరాల భూములున్నాయి. ఇందులోని సర్వేనెంబరు 363/1 నుంచి 369 సర్వేనెంబర్ల వరకు తంగడంచ రెవెన్యూ పరిధిలో ఉన్న 623.40 ఎకరాల భూమిని జైన్‌ఇరిగేషన్ కంపెనీకి కేటాయిస్తున్నట్లు 2015 నవంబరు 12వ తేదీన టీడీపీ ప్రభుత్వం జీఓ నెంబరు 1118 ను విడుదల చేసి 2017 జూన్ 21న సీఎం జైన్ ఇరిగేషన్ కంపెనీని ప్రారంభించారు. 2017 అక్టోబర్ 5న తంగడంచ రెవెన్యూ పరిధిలో ఉన్న 363/1 నుంచి 369 సర్వేనెంబర్ల వరకు ఉన్న 623.40 ఎకరాల భూమిని మెగాసీడ్ పార్కుకు కేటాయిస్తున్నట్లు జీవో నెంబరు: 77ను విడుదలచేసి అదేరోజున మెగాసీడ్‌పార్కు నిర్మాణానికి చంద్రబాబునాయుడు భూమిపూజ చేశారు. వీటితోపాటు ఆచార్య ఎన్‌జీ. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి 499.81 ఎకరాల భూమిని కేటాయిస్తూ జీఓను జారీచేశారు.

భూమి తక్కువ పంపకాలెక్కువ

తంగడంచ ఫారం పరిధిలో అధికారుల లెక్కల ప్రకారం 1603.95ఎకరాల భూములన్నాయి. కేసీ కాల్వ 117.49 ఎకరాలు, భవనాలు, రోడ్లకు 50.00ఎకరాలు, రైతులకు ఇచ్చిన డీఫారం పట్టాలు 73.83 ఎకరాలు పోను మిగిలేది 1362.63ఎకరాలు. అందులో జైన్ ఇరిగేషన్ కంపెనీకి 623.40ఎకరాలు, అంబుజాకు 211 ఎకరాలు (ప్రస్తుతం ఏపీఐఐసీ అధ్వర్యంలో ఆధీనంలో ఉంది). ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ విత్తనోత్పత్తి, పరిశోధన కేంద్రానికి 499.81 ఎకరాలు కేటాయిస్తూ జీవోను విడుదల చేశారు. నికరంగా 28.42ఎకరాల భూమి మిగులుతుంది. అయితే ప్రజలను బురిడి కొట్టించటానికి అప్పట్లో చంద్రబాబునాయుడు, అప్పటి రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రాజశేఖర్ ఫారంలో లేని 623 ఎకరాల భూములను సీడ్‌హబ్‌కు కేటాయిస్తూ జీవోలు జారీచేశారు. ఈ విషయమై అప్పట్లో ప్రధానకార్యదర్శి రాజశేఖర్‌తో ప్రస్తావించగా మనప్రభుత్వమే కదా భూములను సర్దుకుందామని పేర్కొనటం జరిగింది. కాగా ఆచార్య ఎన్‌జీ రంగాకు కేటాయించిన భూములను వెనక్కి తీసుకొని సీడ్‌హబ్‌కు కేటాయిస్తున్నామని పేర్కొనటంతో ఆచార్య ఎన్‌జీరంగా పరిశోధన కేంద్రం తిరిగి నంద్యాలకు వెళ్లింది. ప్రస్తుతం ఈ భూములు తంగడంచ ఫారం అధికారుల ఆధీనంలో ఉన్నాయి.

ప్రస్తుతం బీడుగా ఉన్న సీడ్‌హబ్ భూములు

టీడీపీ పాలనలో సీడ్‌హబ్‌కు కేటాయించిన భూములు ప్రస్తుతం బీడుగా ఉన్నాయి. తంగడంచ ఫారం అధికారులు వాటిలోని ముళ్లపొదలను తొలగించి ప్రస్తుతం 150ఎకరాల భూములను సాగులోకి తెచ్చారు.

ఫారం భూముల పూర్తి వివరాలు తెలియవు

నేను తంగడంచ ఫారం ఇన్‌చార్జ్ ఏడీఏ గా విధులు నిర్వహిస్తున్నాను. నాకు ఫారం భూముల పూర్తి విస్తీర్ణం వివరాలు తెలియవు. టీడీపీ పాలనలో ఇచ్చిన జీవోల వివరాలు తెలియవు. ప్రస్తుతం ఖరీఫ్,రబీ సీజన్‌లలో సుమారు 200ఎకరాల మేర ఫారం భూములను సాగుచేసి పంటలు వేస్తున్నాం. బీడుగా ఉన్న భూముల్లో జంగిల్ క్లియరెన్స్ చేసి పంటల సాగుకు అనుమతులు ఇవ్వాలని కమిషనరేట్ అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఇంకా అనుమతులు మంజూరు కాలేదు.

–విజయశేఖర్, ఇన్‌చార్జ్ ఫారం ఏడీఏ

బీసీ గురుకుల ప్రవేశ పరీక్ష

శ్రీశైలంప్రాజెక్ట్: మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల శ్రీశైలంలో 5 వ తరగతి ప్రవేశానికి ఆదివారం ఉదయం ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. 554 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 378 మంది పరీక్షకు హాజరయ్యారు.

మొబైల్ ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

జూపాడుబంగ్లా: ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న మొబైల్ ఆధార్‌సేవలను సద్వినియోగం చేసుకొని ఆధార్‌కార్డుల్లో చేర్పులు, మార్పులు చేసుకోవాలని ఎంపీడీఓ మంజులవాణి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈనెల18తేదీ నుంచి ఆధార్‌కార్డులో చేర్పులు, మార్పులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 18న పారుమంచాల, తూడిచెర్ల, 19న తరిగోపుల, పి.లింగాపురం, 20న 80బన్నూరు, పోతులపాడు, 26న తాటిపాడు, భాస్కరాపురం, 27న తంగడంచ, తర్వాత గ్రామసచివాలయాల్లో ఆధార్‌కేంద్రాలను ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు.

ఆర్థిక సాయం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం కేశ ఖండనశాలలో పనిచేస్తూ మృతి చెందిన చెల్లిమెల్ల శ్రీనివాసులు కుటుంబసభ్యులకు శ్రీశైల దేవస్థాన కేశఖండనశాల నాయీబ్రాహ్మణ సంఘం తరపున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆదివారం శ్రీశైలంలో చెల్లిమెల్ల శ్రీనివాసులు కుటుంబసభ్యులకు రూ.10 వేలు సంఘం తరపున అందించారు.

జగనన్నతోనే బంగారు భవిష్యత్తు

పగిడ్యాల: భావితరాల భవిష్యత్‌ను బంగారుమయం చేయాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, నందికొట్కూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు జగన్ననే మా భవిష్యత్ కార్యక్రమాన్ని మొక్కవోని ఆత్మవిశ్వాసం నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ తిరిగి జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లును అంటించి ప్రజల్లో భరోసా కల్పిస్తున్నారు. ఆదివారం మండలంలో జరిగిన కార్యక్రమాల్లో సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు పాలూరు వెంకటేశ్వర్లు, పులేంద్రనాయుడు, పల్లె సత్యనారాయణరెడ్డి, కురువ మల్లయ్య, దివాన్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల గుండె చప్పుడు సీఎం జగన్

మిడుతూరు: పేదల గుండె చప్పుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ నాయకులు డీసీ నాగిరెడ్డి అన్నారు. ఆదివారం మండలపరిధిలోని జలకనూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సర్వోత్తమరెడ్డి, మల్లు రామలింగారెడ్డి, తిరుపాల్‌రెడ్డి, అబ్దుల్ గని, రవికుమార్, పుల్లయ్య పాల్గొన్నారు.

ముమ్మరంగా జగనన్నే మా భవిష్యత్తు

కొత్తపల్లి: మండలంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతనిధులు, నాయకులు ముమ్మరం చేశారు. ఆదివారం కొక్కెరంచ గ్రామంలో మండల ఉపాధ్యక్షుడు సింగారం రంగ, ముసలిమడుగు గ్రామంలో సర్పంచ్ జమిలాబీ ఆధ్వర్యంలో గడప, గడపకు తిరిగి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో మండల మాజీ ఉపాధ్యక్షుడు మహబూబ్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు జగదీష్ గౌడు, దాసు, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో 'జగనన్నే మా భవిష్యత్'

ఆత్మకూరు: పట్టణంలోని 16వ వార్డులో ఆదివారం మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. 16వ వార్డు కౌన్సిలర్ విజయచౌదరి, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు సయ్యద్‌మీర్ , కలిముల్లాలు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలు వివరించారు. కార్యక్రమంలో కన్వీనర్ నాగరాజు, తిమోతి, డీలర్ రమణ, వహీద్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పెద్దనంతపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్ష్మణరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కన్వీనర్ శివారెడ్డి, మంజులబాయి, రాజేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి సీఎం జగన్ పెద్దపీట

మహానంది: పేదల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొమ్మాపాల మహేశ్వరరెడ్డి అన్నారు. గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలో ఆదివారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాగశేషుడు, మాజీ ఉపసర్పంచ్ కందుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

అల్లా అందరి ఆయురారోగ్యాలను కాపాడాలి



ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్థర్

నందికొట్కూరు: అల్లా అందరి ఆయురారోగ్యాలను కాపాడాలని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ప్రార్థించారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని స్వగృహంలో జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యేను వైఎస్ చైర్మన్, కౌన్సిలరు జాకీర్ హుసేన్, రబ్బానీ గోడౌన్స్ అధినేత తాటిపాడు మహబూబ్‌సాహెబ్ సత్కరించారు. ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో 30 రోజుల పాటు ముస్లిం కఠోర ఉపవాసాలు పాటిస్తూ సర్వమానవాళి ఆనందోత్సవంగా ఉండాలని కోరుకుంటారన్నారు. రైతులకు మంచిగా పంటలు పండే విధంగా అల్లా దీవించాలన్నారు. తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, కౌన్సిలరు ధర్మారెడ్డి, ఎస్ఐ ఎస్వీ రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్ర, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం



ఆత్మకూరులో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



శ్రీశైలంలో లాడ్జింగ్ సిబ్బందికి మంటలను ఆర్పడంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: అగ్నిప్రమాదాల పట్ల ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు అగ్నిమాపక కేంద్ర అధికారి భీముడు నాయక్ తెలిపారు. పట్టణంలోని ఏపీఎస్ ఆర్టీసీ డిపోలో ఆదివారం అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ప్రయాణికులకు అగ్నిప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ఎలా రక్షించుకోవాలి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం మహేంద్రుడు, సీఐ కోటయ్య నాయక్ పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: మంటలు చెలరేగినప్పుడు భయపడకుండా వాటిని ఎలా అదుపులోకి తీసుకురావాలో ప్రదర్శన ద్వారా ఆదివారం ఫైర్ సిబ్బంది చూపించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఫైర్‌సిబ్బంది శ్రీశైలం ప్రాజెక్ట్ కాలనీలో ఉన్న ఓ ప్రైవేట్ లాడ్జ్ వద్ద డెమో నిర్వహించారు. చమురు, గ్యాస్ , లికేజీ వలన ఏర్పడిన మంటలను ఎలా అదుపులోకి తీసుకురావాలో వివరించారు. ఫైర్ ఆఫీసర్ గుణశేఖర్‌రెడ్డి, లీడింగ్ ఫైర్‌మెన్ పి.అయుబ్‌ఖాన్, ఆపరేటర్ ఎస్ వెంకటేశ్వర్లు, ఫైర్‌మెన్‌లు డి.రమేష్, కె.సురేష్ కుమార్, పి.బుచ్చయ్య, హోంగార్డులు పాల్గొన్నారు.

98 క్వాలిఫైడ్స్ అభ్యర్థులందరికీ న్యాయం



మాట్లాడుతున్న లక్ష్మణ్‌నాయక్

నంద్యాల(అర్బన్): 98 క్వాలిఫైడ్స్‌లో ఉద్యోగాలు రాని అభ్యర్థులందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి న్యాయం చేస్తారనే నమ్మకం తమకు ఉందని, ఎస్సీ,ఎస్టీ, ఉపాధ్యాయ సంఘం నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ నాయక్ తెలిపారు. క్వాలిఫైడ్‌ల ఎంపికలో రిజర్వేషన్లను అమలు చేయకపోవడం అన్యాయమని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన 98డీఎస్సీ క్వాలీఫైడ్ అభ్యర్థుల ఉపాధ్యాయ నియామకాల్లో రిజర్వేషన్లు అమలు చేయకపోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. నాయకులు రాజు, శ్రీనివాసులు, దేవేంద్రుడు, లక్కా భాస్కర్, హరికృష్ణ పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

పాములపాడు: కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేకాధికారి రాజ్యలక్ష్మి తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో 40 సీట్లు, 7వ తరగతి 2, 8వ తరగతి 2, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం 40 సీట్ల చొప్పున ఖాళీలున్నట్లు వివరించారు. ఈనెల 20వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు) పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ , బీపీఎల్, బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఘనంగా కుందమాల పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): సూరన సారస్వత సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ప్రముఖ రచయిత్రి డాక్టర్ శ్రీదేవి రచించిన కుందమాల పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ రామేశ్వరరెడ్డి హాజరై పుస్తకావిష్కరణ గావించారు. రచయిత శ్రీదేవి మాట్లాడుతూ.. తన పుస్తకాన్ని డాక్టర్ రామేశ్వరరెడ్డికి అంకితం చేశానని చెప్పారు. ఈ పుస్తకంలో రామాయణంలో సీతను రథంపై తీసుకెళ్తున్న సమయంలో లక్ష్మణుడి మనోవేదన చక్కగా ఆవిష్కరించానన్నారు. కుందమాల అనగా ఉత్తమ రామాయణమని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణారెడ్డి, సహదేవుడు, లక్ష్మీసరస్వతి, డాక్టర్ దీవీ హయగ్రీవాచారి, అన్నెం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంపై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు: నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలో 4వ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎం సావిత్రిని వెంటనే సస్పెండ్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం డిమాండ్ చేశారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్‌హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 19 సంవత్సరాలుగా ఆశావర్కర్ విధులు నిర్వహిస్తూ గర్భిణులకు, బాలింతలకు సేవలందిస్తూ పట్టణ ప్రజల అభిమానులు చూరగొంటున్న ఆశావర్కర్ నజీరున్నిసాను ఏఎన్ఎమ్ సావిత్రి వేధించడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి

ఆత్మకూరు: కేంద్రంలోని బీజేపీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో ఆదివారం ఆ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజా స్వామ్యం కుంటుపడిందని, ప్రతి వ్యక్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గ చర్యలను నిలదీయాలన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు , నిరంకుశ, మతోన్మాద విధానాలను ప్రేరేపిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంస్థలైన ఎల్ఐసీ, రైల్వే , ఓడరేవుడు, చివరకు అన్నం పెట్టే వ్యవసాయాన్ని కూడా కార్పొరేట్‌పాలు చేశారన్నారు. ఈ నెల 18 నుంచి ఆత్మకూరు డివిజన్‌పరిధిలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రచార యాత్ర నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రజాక్, సుల్తాన్, మాబాషా, రణధీర్, వెంకటేశ్వర్లు, స్వాములు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్య, వైజ్ఞానిక ప్రదర్శన



జాతీయ నాయకుల ఫొటోల గురించి వివరిస్తున్న విద్యార్థులు

గడివేముల: మండల కేంద్రంలోని స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన విద్య, వైజ్ఞానిక ప్రదర్శన ఆకటుకుంది. హెచ్‌ఎం శ్రీనివాసులు ఈ ప్రదర్శనను ప్రారంభించారు. విద్యార్థులు పలు నమూనాలు రూపొందించి ప్రదర్శించారు. ముఖ్యంగా దేశనాయకులు, రాజకీయ, భౌతిక పటాలు, వర్షమాపకం, వర్షపునీటిని నిల్వ చేయడం, ఫస్ట్ ఎయిడ్‌బాక్స్, మట్టిపొరలు, వాతావరణ కాలుష్యం, పేదవాడి ఫ్రిజ్, జాతీయ చిహ్నాల గురించి విద్యార్థులు వివరించిన తీరు ఆకట్టుకుంది. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయని హెచ్‌ఎం చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దస్తగిరమ్మ, నాగన్న, కళ్యాణ్, హేమేంద్ర, లక్ష్మణకుమార్, ఖాదర్‌బాషా, నూరుల్లా, రెహానా, షేక్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృతజ్ఞతా దినోత్సవం

నంద్యాల(వ్యవసాయం): జమాతే ఇస్లామి హింద్ 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం సంఘం కార్యాలయంలో కృతజ్ఞతా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. షేక్ అబ్దుల్ సమ్మద్ మాట్లాడుతూ సంఘం 1947 ఏప్రిల్ 16న ఆవిర్భవించిందని, దేశ వ్యాప్తంగా ప్రజలకు వ్యక్తిగతంగా, ధార్మికంగా సమాజానికి బాధ్యతాయుతంగా దిశ, నిర్దేశం చేస్తుందన్నారు. మున్సి అబ్దుల్ రహింఖాన్, సయ్యద్ యూసుఫ్, అబ్దుల్‌ఖాదర్, సాలార్‌ఖాన్, అబ్దుల్ సత్తార్, హబీబుల్లా, మహమ్మద్, అబ్దుల్‌రహిమాన్‌కు నివాళులర్పించారు. జక్రియా, మోమిన్‌గౌస్, అబ్దుల్ ఖాదర్ జిలానీ, సలీం పాల్గొన్నారు.

డాక్టర్ ప్రభాకర్‌రెడ్డికి సుజన హితైషి పురస్కారం

కర్నూలు(హాస్పిటల్): హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈ–అభ్యాస్ అనే విద్యాసంస్థ ఆదివారం కర్నూలుకు చెందిన కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డికి సుజన హితైషి అనే పురస్కారాన్ని ఇచ్చి సన్మానించారు. వైద్యరంగంలో తాను అందిస్తున్న సేవలకు గాను ఈ పురస్కారాన్ని అందజేశారని డాక్టర్ ప్రభాకరరెడ్డి తెలిపారు. ఈ సంస్థ ఏపీ, తెలంగాణాల్లో చదివే గ్రామీణ విద్యార్థులకు తక్కువ ఖర్చులో కార్పొరేట్ విద్యను అందిస్తోందని, పోటీ పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థులలో స్ఫూర్తి నింపుతోందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా అధ్యక్షులు డాక్టర్ జయప్రకాష్‌నారాయణ, శాంతా బయోటిక్ చైర్మన్ పద్మభూషణ్ వరప్రసాద్‌రెడ్డి, ఈ–అభ్యాస్ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

బార్లుగా మారిన చీకుల దుకాణాలు



జాతరలోని చీకుల దుకాణంలో కూర్చొని మద్యం సేవిస్తూ చీకులు ఆరగిస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: తర్తూరు జాతరలో నేటికీ యథేచ్ఛగా మద్యం విక్రయాలు జరగుతుండగా, జాతరలోని చీకుల దుకాణాలు బార్లను తలపిస్తున్నాయి. సాయంత్రం వేళల్లో కేవలం చీకులు ఆరగించేందుకు వస్తున్న వారికి దుకాణ దారులే స్వయంగా మందు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. తర్తూరు జాతరలో అక్రమ మద్యం విక్రయాలపై సెబ్ పోలీసులకు పక్కా సమాచారం ఉన్నా దాడులు నిర్వహించకపోవటం వెనుక అంతర్యమేమిటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సెబ్ పోలీసులు దాడులు నిర్వహించి తర్తూరులో మద్యం విక్రయాలను అరికట్టాలని కోరుతున్నారు.

భగవద్గీత పఠనంతో మానసిక ప్రశాంతత

కర్నూలు కల్చరల్: భగవద్గీత పఠనంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు అన్నారు. ఆదివారం ఇస్కాన్ జగన్నాథ మందిరంలో శ్రీల ప్రభుపాద ప్రేమ విందు కార్యక్రమం జరిగింది. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. అనంతరం భగవద్గీతపై ఆయన ప్రవచనం చెప్పారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠనం, శ్రవణం చేయాలన్నారు. సమస్త సమస్యలకు భగవద్గీతలో పరిష్కారం దొరుకుతుందన్నారు. హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన జప యజ్ఞం చేశారు. అనంతరం జగన్నాథ్‌కు మహారాజభోగ నివేధన చేశారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కేంద్రంలోని బీజేపీకి గుణపాఠం నేర్పాలి



నెహ్రూనగర్‌లో ప్రచార భేరీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పగిడ్యాల: తొమ్మిదేళ్లుగా దేశంలో అధికారం చెలాయిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికలలో తగిన గుణపాఠం చెప్పి ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో నెహ్రూనగర్‌లో ప్రచార భేరీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పిస్తామని బీజేపీ ప్రభుత్వం హామీ ఇచ్చిన నెరవేర్చకపోవడం శోచనీయమని విమర్శించారు. హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా నందికొట్కూరు, మిడుతూరు మండలాలకు, నాగటూరు లిఫ్ట్ నుంచి పగిడ్యాల, నందికొట్కూరు గ్రామాలకు పంట కాలువల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు భాస్కరరెడ్డి, వెంకటేశ్వర్లు, పక్కీర్‌సాహెబ్, లక్ష్మన్న, ఈశ్వరమ్మ, బీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దింపుదాం

కొత్తపల్లి: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని గద్దె దింపుదామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. శ్రీనివాసులు , మండల కార్యదర్శి వెంకటశివుడు పిలుపునిచ్చారు. ఆదివారం కొత్తపల్లిలో బీజేపీ ప్రజా వ్యతిరేక, మతోన్మాద చర్యలకు వ్యతిరేకంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ప్రసాదు, భీమలింగం , నాగశేషులు, తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధం కావాలని వామపక్ష పార్టీల నాయకులు రామేశ్వరరావు, ప్రతాప్ పిలుపునిచ్చారు. ఆదివారం పాములపాడు మండల పరిధిలోని ఇస్కాల గ్రామంలో ప్రచార భేరీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు స్వామన్న, బాలయ్య, వెంకటేశ్వరరావు, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.